
నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శనివారం 28 సెప్టెంబర్ 2024 | KHAMMAM

## ‘2008 డీఎస్సీ’ అభ్యర్థులకు..
# 30న సర్టిఫికెట్ల పరిశీలన

- వెబ్‌సైట్‌లో అభ్యర్థుల వివరాలు..
- కాంట్రాక్టు పద్ధతిలో ఎస్జీటీలుగా నియామకం



ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 27: అర్హత సాధించి ఉద్యోగాలకు దూరమైన డీఎస్సీ-2008 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఈనెల 30వ తేదీన చేపట్టనున్నారు. వీరిని కాంట్రాక్టు పద్ధతిలో ఎస్జీటీలుగా నియమించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఉమ్మడి జిల్లా పరిధిలో డీఎస్సీ-2008 రాసి 70:30 నిష్పత్తిలో రిజర్వేషన్ వల్ల ప్రభావితమైన బీఈడీ అభ్యర్థులను గుర్తించిన విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆ జాబితాను జిల్లాలకు ఈ నెల 26వ తేదీన పంపించారు. వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చడంతోపాటు అభ్యర్థులకు సమాచారం ఇస్తూ.. ప్రత్యేకంగా రూపొందించిన నమూనాను పూర్తి చేసి.. దానిని సర్టిఫికెట్ల పరిశీలన రోజు అందజేయాలని నిబంధనల్లో పేర్కొన్నారు.

### ఖమ్మంలో ఒక్కరోజే పరిశీలన

ఉమ్మడి రాష్ట్రంలో డీఎస్సీ-2008 నిర్వహించిన సందర్భంగా సర్టిఫికెట్ల పరిశీలన చేసి ఒకటి, రెండు రోజుల్లో ఉద్యోగాల్లో చేరేందుకు ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉండగా.. ఆ సమయంలో 30 శాతం పోస్టులను ప్రత్యేకంగా డీఈడీ చేసిన వారికి కేటాయించారు. దీంతో బీఈడీ చేసిన వారు మార్కుల పరంగా ముందున్నప్పటికీ నష్టపోయారు. తమకు ఉద్యోగాలు ఇవ్వాలని పోరాటం చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం వీరికి సంబంధించిన తుది జాబితాను వెలువరించి ఈ నెల 27వ తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదిలోపు ధ్రువపత్రాల పరిశీలన చేయాలని సూచించింది. అయితే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రెండు రోజులపాటు సర్టిఫికెట్ల పరిశీలన చేస్తుండగా.. ఖమ్మంలో మాత్రం ఒక్క రోజులోనే పూర్తి చేయాలని నిర్ణయించారు.

### 30న పాత డీఈవో కార్యాలయంలో..

ఈ నెల 30న ఖమ్మంలోని పాత డీఈవో కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నారు. డీఎస్సీ-2008లో మైదాన ప్రాంతంలో 128 మంది, ఏజెన్సీలో 215 మంది అభ్యర్థులున్నారు. వీరు.. 1 నుంచి 7వ తరగతి వరకు బోనఫైడ్ సర్టిఫికెట్, విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పీహెచ్‌సీ వీహెచ్/ హెచ్‌హెచ్/ ఓహెచ్ సర్టిఫికెట్, హాల్ టికెట్ నెంబర్, ర్యాంక్ కార్డు, పాస్‌పోర్టు ఫొటోలతో హాజరుకావాలి. విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన ప్రత్యేక ధ్రువీకరణ పత్రం డౌన్‌లోడ్ చేసుకొని దానిని పూర్తి చేసి గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి సమర్పించాలి.



వరంగల్ క్రాస్ రోడ్డు

### గత ప్రభుత్వంలోనే ప్రతిపాదనలు..

పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఖమ్మం రూరలే అతిపెద్దది. తాజా గణాంకాల ప్రకారం మండల పరిధిలో 31 పంచాయతీలు ఉన్నాయి. గతంలో పెద్దతండా, ఏదులాపురం, గుర్రాలపాడు, గుదిమళ్ల, వెంకటగిరి గ్రామాలు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ)లో విలీనం కావడంతో రఘునాథపాలెం మండలంలోని కామంచికల్, పడమటితండా, జాన్‌బాద్‌తండాలను ఖమ్మం రూరల్ మండలంలోకి తీసుకొచ్చారు. అనంతరం విలీన పంచాయతీల పరిధిలోని ప్రజల కోరిక మేరకు కార్పొరేషన్ నుంచి విడిపోయి తిరిగి ఖమ్మం రూరల్ మండలం పరిధిలోకి వచ్చాయి. దీంతో ప్రస్తుతం 28 పంచాయతీలకు తోడు మరో మూడు పంచాయతీలైన పడమటితండా, కామంచికల్, దారేడు.. ఖమ్మం రూరల్ పరిధిలోకి వచ్చాయి. దీంతో లక్షమంది ఓటర్లకు పైబడిన మండలంగా ఖమ్మం రూరల్ అవతరించింది. అయితే మండల విస్తీర్ణం భారీగా పెరగడంతో మరో మండల కేంద్రం గానీ, విలీన పంచాయతీలతో కూడిన గ్రామాలను మున్సిపాలిటీగా గానీ ఏర్పాటు చేయాలని గత కేసీఆర్ ప్రభుత్వంలో చర్చ జరిగింది. దీంతో అప్పట్లోనే అధికారులు బైఫరికేషన్ ప్రక్రియతో కూడిన బ్లూప్రింట్‌ను కూడా సిద్ధం చేశారు. కానీ.. అప్పటికే ఎన్నికలు సమీపించడంతో ఆ ప్రతిపాదన ముందుకు సాగలేదు.




# మున్సిపాలిటీగా ఏదులాపురం!

- పన్నెండు పంచాయతీల విలీనంతో ఏర్పాటు
- ‘పాలేరు’లో తొలి మున్సిపాలిటీగా రికార్డు
- అధికారుల రూపకల్పనతో సిద్ధమైన డ్రాఫ్ట్
- మున్సిపల్ శాఖ ఆమోదమే తరువాయి
- తెరమరుగు కానున్న పెద్దతండా పేరు

**పాలేరు నియోజకవర్గంలో తొలి మున్సిపాలిటీ ప్రకటన కొద్దిరోజుల్లో వచ్చే అవకాశముంది. ఇందుకు సంబంధించిన మండల, జిల్లా స్థాయి ప్రక్రియ ముగిసింది. అయితే గతంలో అనుకున్నట్లుగా 10 పంచాయతీలు కాకుండా.. 12 పంచాయతీలు విలీనం కానున్నాయి. ప్రస్తుత మండల కేంద్రంగా ఉన్న పెద్దతండాకు బదులు ఏదులాపురం కేంద్రంగా మున్సిపాలిటీని ఖరారు చేస్తూ కలెక్టర్ ఆమోదం తెలిపారు. అధికారిక ఉత్తర్వుల నిమిత్తం రాష్ట్ర మున్సిపల్ శాఖకు నివేదికను పంపారు. గతంలో పది పంచాయతీలే అనుకున్నప్పటికీ కొత్తగా బారుగూడెం, తెల్దారుపల్లి గ్రామాలనూ నూతన మున్సిపాలిటీ పరిధిలోకి తీసుకొస్తూ ముసాయిదా(డ్రాఫ్ట్)ను రూపొందించారు. వీటితోపాటు పల్లెగూడెం, పోలేపల్లి గ్రామాలకు సంబంధించిన కొన్ని కాలనీలు మాత్రమే నూతన మున్సిపాలిటీ పరిధిలోకి రానున్నాయి. తుది నివేదిక ప్రకారం.. బారుగూడెం, గొల్లగూడెం, గుదిమళ్ల, చిన్న వెంకటగిరి, ఏదులాపురం, గుర్రాలపాడు, మద్దులపల్లి, ముత్తగూడెం, పెద్దతండా, పోలేపల్లి (పార్టు), పల్లెగూడెం (పార్టు), తెల్దారుపల్లి గ్రామాలు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోకి రానున్నాయి.** -ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 27

‘పాలేరు’లో తొలి మున్సిపాలిటీగా..

పాలేరు నియోజకవర్గంలో ఏర్పడే తొలి మున్సిపాలిటీ ఏదులాపురమే కానుంది. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లో మున్సిపాలిటీలు ఉన్నప్పటికీ కేవలం పాలేరులో మాత్రమే లేదు. ఇప్పుడు ఏదులాపురం మున్సిపాలిటీ అయితే పాలేరు నియోజకవర్గంలో తొలి మున్సిపాలిటీ అవుతుంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ మున్సిపాలిటీలు ఉన్నట్లవుతుంది. అయితే, ఏదులాపురం మున్సిపాలిటీతోపాటు మరికొద్ది రోజుల్లోనే ఎం.వెంకటాయపాలెం కేంద్రంగా మండలం అవతరించే అవకాశం కన్పిస్తోంది. ఇప్పటికే అక్కడ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు సైతం ప్రతిపాదనలు వెళ్లాయి.

### జాతీయ రహదారుల కూడలిగా..

ఏదులాపురం కేంద్రంగా నూతన మున్సిపాలిటీ ఏర్పడితే అది జాతీయ రహదారుల కూడలిగా కూడా అవతరిస్తుంది. ఇప్పటికే ఖమ్మం రూరల్ మీదుగా కోదాడ-కురవి గ్రీన్‌ఫీల్డ్ హైవే, సూర్యాపేట-దేవరపల్లి హైవే, నాగ్‌పూర్-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవేలు వెళ్తున్న విషయం విదితమే. వీటి నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. కాగా, ఇప్పటికే డ్రాఫ్ట్ సిద్ధమై మున్సిపల్ శాఖ ఆమోదం కోసం వెళ్లిన తరుణంలో మున్సిపాలిటీ ఏర్పాటు ప్రకటన కూడా లాంఛనమయ్యే అవకాశం ఉంది.

| | |
|---|---|
| ప్రతిపాదిత మున్సిపాలిటీ పేరు: | ఏదులాపురం |
| విలీనమయ్యే పంచాయతీల సంఖ్య: | 12 |
| మొత్తం ఓటర్ల సంఖ్య: | 43,874 |
| 2011 లెక్కల ప్రకారం జనాభా: | 58,647 |
| మొత్తం విస్తీర్ణం (ఎకరాల్లో): | 17,253 |

### మారనున్న రాజకీయ ముఖచిత్రం

నూతన మున్సిపాలిటీ ఏర్పాటైతే రాజకీయ ముఖచిత్రం మారడంతోపాటు అనేక కొత్త చిక్కులూ తలెత్తే అవకాశముంది. గతంలో పెద్దతండా, వెంకటగిరి, గుదిమళ్ల, ఏదులాపురం, గుర్రాలపాడు పంచాయతీలను కేఎంసీలో విలీనం చేసిన సమయంలో స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. తమవి పూర్తిగా గ్రామీణ ప్రాంతాలైనందున వీటిని కేఎంసీలో విలీనం చేస్తే ఉపాధి హామీ పథకానికి తాము దూరమవుతామని అప్పట్లో ఆయా గ్రామాల ప్రజలు వాపోవడంతో అప్పటి అధికారులు ఆయా గ్రామాలను విలీనం నుంచి తొలగించారు. మరిప్పుడు 12 పంచాయతీలు విలీనమైతే ఇప్పుడు కూడా ఆయా గ్రామాల ప్రజలు సదరు పథకానికి దూరమయ్యే అవకాశముంటుందని పలు పార్టీల నాయకులు పేర్కొంటున్నారు. కాగా, ప్రతిపాదిత మున్సిపాలిటీలో విలీనమయ్యే పంచాయతీలు ఒక్కో గ్రామం ఒక్కో పార్టీకి కంచుకోటగా ఉన్న విషయం విదితమే. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని సొంత గ్రామం కూడా విలీనమయ్యే అవకాశముంది.






# మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

**అభివృద్ధి పనుల శంకుస్థాపనలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 27: ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని, మున్సిపాలిటీ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 6 నుంచి 12వ వార్డుల్లో రూ.4.70 కోట్ల డీఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైన్లు, పార్కుల నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. పూర్తయిన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూనంనేని మాట్లాడుతూ పది నెలల కాలంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించానన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అంతర్గత రోడ్లు, పారిశుధ్య సమస్యల పరిష్కారం, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, తహసీల్దార్ పుల్లయ్య, కమిషనర్ శేషాంజన్ స్వామి, ఇరిగేషన్ డీఈ రవికుమార్, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, మునిగడప పద్మ, బోయిన విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



బూడిద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

## బూడిద తరలింపుపై కమిటీ వేస్తాం: పీవో

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 27: కేటీపీఎస్ నుంచి వెలువడే బూడిదను తరలించేందుకు కమిటీ వేస్తామని, అందులో తీసుకున్న నిర్ణయం మేరకు యాష్‌ను తరలించే బాధ్యతలు అప్పగిస్తామని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ స్పష్టం చేశారు. కేటీపీఎస్ కాలుష్య ప్రభావిత ప్రాంతాలైన కరకవాగు, పునుకుల, పుల్లాయిగూడెం, సూరారం గ్రామాలను శుక్రవారం కేటీపీఎస్ అధికారులతో కలిసి పీవో సందర్శించారు. బూడిద వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు, సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. యాష్ పాండ్ నుంచి బూడిదను తరలించేందుకు తమకు అవకాశం ఇవ్వాలని ఇటీవల పలు గ్రామాల నిరుద్యోగులు పీవోకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే, కేటీపీఎస్ అధికారులు, సొసైటీ సభ్యులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించి అనుభవం ఉన్న వారితో దరఖాస్తుదారుల సమక్షంలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని పీవో తెలిపారు. ఆ కమిటీలో నిర్ణయం తీసుకున్న తర్వాతే యాష్‌ను తరలించే బాధ్యతను అప్పగిస్తామన్నారు. ఏపీవో డేవిడ్ రాజ్, కేటీపీఎస్ చీఫ్ ఇంజినీర్లు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వర్లు, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

- స్కూల్ ఆఫ్ ఫిషరీస్ శాస్త్రవేత్త డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి
- పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రంలో రైతులకు శిక్షణ




పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న మత్స్యకారులు

కూసుమంచి, సెప్టెంబర్ 27: ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, పలువురికి ఉపాధి కల్పించాలని స్కూల్ ఆఫ్ ఫిషరీస్ శాస్త్రవేత్త డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. పాలేరులోని పీవీ నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో సిరిసిల్ల జిల్లా మత్స్య రైతులకు 3 రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్త విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చేపల పెంపకానికి జల వనరులు పుష్కలంగా ఉన్నాయని, వాటిని మత్స్య రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం కూడా మత్స్య రైతులు, కార్మికుల కోసం అనేక రాయితీలు కల్పిస్తున్నదన్నారు. అనంతరం మత్స్య రైతులు చేపల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మార్కెటింగ్, చేపలకు వ్యాధులు, పిల్లల ఎంపిక, వాటిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన వారికి అధికారులు సరిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు లవన్‌కుమార్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ‘కేవోసీ’ నిర్వాసితులకు నీడేది?

- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తున్న కేవోసీలో టార్బల్ కట్టే కూలీలు
- సింగరేణికి భూములు ఇచ్చినా కనికరం చూపని అధికారులు
- వన్‌టైం పరిహారం ఇచ్చి చేతులు దులుపుకున్న యాజమాన్యం
- పని ప్రదేశంలో షెడ్లు, కనీస సౌకర్యాలు లేక కూలీల అవస్థలు



గని వద్ద ఉన్న లోడింగ్ ప్రదేశం

టేకులపల్లి, సెప్టెంబర్ 27: సింగరేణి సంస్థ గణనీయమైన బొగ్గు ఉత్పత్తిని సాధించి లాభాల బాటలో పయనిస్తున్నా.. ఉపరితల గనిలో భూములు కోల్పోయిన నిర్వాసితులు మాత్రం కోయగూడెం ఉపరితల గని-2(కేవోసీ)లో టార్బల్ కట్టే కూలీలుగా పనిచేస్తూ దుర్భర జీవితాలు గడుపుతున్నారు. కేవోసీ వద్ద పొద్దంతా పని చేసినా పని ప్రదేశంలో నిలువ నీడతోపాటు కనీస సౌకర్యాలు లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఏ కాలంలోనైనా చెట్ల నీడనే నమ్ముకుని పనులు చేసుకుంటున్న కూలీలకు కనీసం నీడ కల్పించాలనే ఆలోచన యాజమాన్యం చేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. భూమి కోల్పోయిన నిర్వాసితులకు వన్‌టైం పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుందే తప్ప వారి బాగోగుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. కోయగూడెం పరిసర ప్రాంతాల్లో 22 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఉపరితల గనిలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు బొగ్గు రవాణాలో భాగంగా లారీలు, టిప్పర్లకు లోడ్‌పై బొగ్గు పెళ్లలు జారిపడకుండా టార్బల్ కట్టే కూలీలుగా పని చేసేందుకు సింగరేణి యాజమాన్యం అనుమతి ఇచ్చింది. దీంతో కేవోసీ-2లో లచ్చగూడెం, కిష్టారం, దారపాడు, లక్ష్మీపురం గ్రామాలకు చెందిన 240 మంది నిర్వాసితులు 4 గ్రూపులుగా విడిపోయి పనులు చేస్తున్నారు. ఒక్కో గ్రూపునకు 60 మంది చొప్పున 4 రోజులు నాలుగు గ్రూపుల వారు పనికి వెళ్లి షిఫ్టు విధానంలో పని చేయాలి. అయితే ఒక గ్రూపు సభ్యులు ఒక రోజు పనికి వెళితే.. మూడు రోజులు ఇంటి వద్దే ఉంటారు. ప్రతి గ్రూపు 24 గంటలపాటు పని చేయాలి. లారీలు ఎక్కువగా వస్తే కూలి వస్తుంది.. లేదంటే అంతే సంగతులు. ఈ 24 గంటల్లో ఒక రాత్రి.. ఒక పగలు ఉంటుంది. ఈ సమయంలో కూలీలు ఇంటి వద్ద నుంచి తీసుకెళ్లిన భోజనాలు పెట్టుకోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి కనీస సౌకర్యాలు లేకపోవడంతో చెట్ల కిందే ఉండాల్సి వస్తుంది. తాగునీరు కూడా లేని పరిస్థితి. దీనిని సింగరేణి అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని నిర్వాసితులు వాపోతున్నారు.



పని ప్రదేశంలో చెట్ల నీడన నిలుచున్న కూలీలు

### లాభాల్లో వాటా ఇవ్వాలి..



సింగరేణి యాజమాన్యం అన్ని విధాల ఆలోచించి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులకు లాభాల్లో వాటా ఇస్తుంది. కానీ.. భూ నిర్వాసితులను పూర్తిగా మర్చిపోయింది. సింగరేణిలో ఒకసారి ఉద్యోగం వస్తే కంపెనీ అన్నీ చూసుకుంటుంది. కానీ.. భూమి కోల్పోయిన నిర్వాసితులకు వన్‌టైం పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంది.
**-కొర్స చుక్కయ్య, నిర్వాసితుడు, లచ్చగూడెం**

### ఏళ్లు గడిచినా షెడ్డు లేదు..



కోయగూడెం ఉపరితల గని-2లో మా భూమి పోయింది. 2016 నుంచి టార్బల్ కూలీగా పని చేస్తున్నా. అప్పటి నుంచి ఏటా సింగరేణి అధికారులు వస్తున్నారు.. చూస్తున్నారు. మీకు ఎండ, వర్షం నుంచి రక్షణ కోసం షెడ్ వేస్తాం అని చెబుతున్నా.. ఇప్పటివరకు షెడ్డు వేయలేదు. దీని గురించి సింగరేణి ఉన్నతాధికారులు, స్థానిక నాయకులు చొరవ తీసుకోవాలి. **-కొర్స నర్సయ్య, నిర్వాసితుడు, కిష్టారం**

### అధికారులు మాట తప్పారు..



నాకున్న మూడెకరాల భూమి ఓసీ కింద పోయింది. దీంతో టార్బల్ కూలీగా పని చేస్తున్నా. పనికాడ కనీసం నీడ కూడా లేదు. చెట్టుకొకరు.. పుట్టకొకరు చొప్పున ఉంటున్నాం. రాత్రి సమయంలో చాలా ఇబ్బందిగా ఉంది. సింగరేణి అధికారులు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పి ఇంతవరకు పట్టించుకోలేదు. నీడ కోసం షెడ్లు వేసి మాకు రక్షణ కల్పించాలి. **-జబ్బ పొట్టయ్య, నిర్వాసితుడు, కిష్టారం**

### కూలి గిట్టుబాటు కావట్లేదు..



నాలుగు రోజుల్లో మూడు రోజులు ఇంటి వద్దే ఉంటున్నాం. పనికి వెళ్లిన ఒక్కరోజు కూడా లారీలు సరిగా రాక కూలి గిట్టుబాటు కావట్లేదు. సింగరేణి సంస్థ లాభాల్లో ఉన్నా.. మాలాంటి భూములు కోల్పోయిన వారిపై దయ చూపడం లేదు. విశ్రాంతి తీసుకునేందుకు కనీసం షెడ్లు లేవు. మా సమస్యను పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. **-బట్టు కోటయ్య, నిర్వాసితుడు, లచ్చగూడెం**

# పాలేరుకొచ్చిన సాగర్ జలాలు

- క్రమంగా పెరుగుతున్న రిజర్వాయర్ నీటిమట్టం
- సాగర్ చివరి ఆయకట్టుకు ఇంకా చేరని సాగునీళ్లు



నాయకన్‌గూడెం వద్ద ఇన్‌ఫాల్ కాల్వ ద్వారా పాలేరుకు చేరుతున్న సాగర్ జలాలు

కూసుమంచి, సెప్టెంబర్ 27: సాగర్ జలాలు వచ్చి చేరడంతో పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. జిల్లా సరిహద్దు నాయకన్‌గూడెం సమీపంలోని సూర్యాపేట జిల్లా నడిగూడెం రంగుల బ్రిడ్జి వద్ద ఇటీవల పడిన గండిని పరిశీలించిన రాష్ట్ర భారీ, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. కాల్వ పనులన్నీ ఒక్క రోజులోనే పూర్తి చేయాలని ఆదేశించారు. మొదటి జోన్ కింద నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో పంటలు ఎండిపోకుండా డ్యాం నుంచి నీటిని ఇవ్వాలని ఆదేశించారు. దీంతో బుధవారం డ్యాం నుంచి నీటిని వదలడంతో శుక్రవారం తెల్లవారుజాము వరకు పాలేరుకు జలాలు చేరాయి. దీనికితోడు గత మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో వరద రావడంతో పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. ప్రస్తుతం పాలేరుకు సాగర్ నుంచి 1,200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. వరదతో 2,800 క్యూసెక్కులు వస్తున్నది. దీంతో పాలేరు నుంచి 2,800 క్యూసెక్కుల నీటిని జిల్లాలోని ఆయకట్టు పంటలకు వదులుతున్నారు. పాలేరు పాత కాల్వకు 200 క్యూసెక్కులు, మిషన్ భగీరథ తాగునీటి అవసరాల కోసం 135 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. పాలేరుకు ఇన్ ఫ్లో 4,000 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 3,135 క్యూసెక్కులు ఉండగా.. క్రమంగా నీటిమట్టం పెరుగుతున్నది. ప్రస్తుతానికి పాలేరు నీటిమట్టం 19 అడుగులకు చేరింది. మళ్లీ అకాల వర్షాలు, వరదలు వస్తే ఇబ్బంది కలగకుండా పూర్తిస్థాయిలో కాకుండా రెండు నుంచి మూడు అడుగుల వ్యత్యాసంలో నీటిమట్టం ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు.

### చివరి భూములకు చేరని నీరు


పాలేరు రిజర్వాయర్ పరిధిలోని సాగర్ ఎడమ కాల్వ రెండో జోన్ పాలేరు నుంచి కల్లూరు వరకు ఉండగా.. కల్లూరు నుంచి ఎన్టీఆర్ జిల్లా నూజివీడు వరకు మూడో జోన్ ఉంది. అయితే మంగళవారం తెల్లవారుజామున కాల్వ గండిని పూడ్చిన అధికారులు పాలేరు రిజర్వాయర్ నుంచి నీటిని వదిలారు. ఈ క్రమంలో భారీ వర్షం కురిసి కొంత ఊరట కలిగినా.. శుక్రవారం సాయంత్రం వరకు కూడా జిల్లా సరిహద్దు కల్లూరు వరకు సాగర్ జలాలు చేరలేదు. అయితే నీటిని ఎక్కువగా వదిలితే ఇటీవల మరమ్మతు చేసిన కాల్వకు ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో అధికారులు తక్కువగా నీటిని వదులుతున్నారు. పాలేరు నుంచి కనీసం 3,500 క్యూసెక్కుల నీటిని వదిలితే అన్ని మేజర్లు, మైనర్లకు నీరందుతుంది.

### నీటి తోడివేత పనుల పరిశీలన

యూటీని పూర్తిగా మూసివేయడంతో పైనున్న పొలాల్లోకి నీరు చేరకుండా ఉండేందుకు 100 హెచ్‌పీ మోటర్లు ఒక చోట 4, మరోచోట 25 హెచ్‌పీ మోటర్లు రెండు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం యూటీ వద్ద నీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కాల్వ గండి, యూటీ లీక్ ప్రాంతాలను చీఫ్ ఇంజినీర్ విద్యాసాగర్ పరిశీలించారు. ఈఈ అనన్య, మంగలపుడి వెంకటేశ్వర్లు, డీఈలు మధు, రత్నకుమారి, రమేశ్, సిబ్బంది పనులను పర్యవేక్షిస్తున్నారు.

### పనులపై కలెక్టర్ ఆరా..

పాలేరు కాల్వ మరమ్మతు చేసిన యూటీ వద్ద నీటి నిల్వల తోడివేతపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఎప్పటికప్పుడు సీఈతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్నారు. గతంలో కాల్వ కట్ట ఎంత ఎత్తు ఉందో అదే స్థాయిలో కట్ట ఎత్తు పెంచారు.



యూటీ నుంచి నీటిని ఎత్తి కాల్వలో పోస్తున్న మోటర్లు